విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 18 అక్టోబర్ 2024 | 8 పేజీలు

తప్పిన ముంపు

- ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం
- గుండ్లకమ్మ ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తివేత
- 1100 హెక్టార్లలో పంటల నష్టం
- పూర్తిస్థాయి అంచనాలో వ్యవసాయశాఖ అధికారులు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటడంతో జిల్లాకు ముప్పు తప్పింది. నాలుగు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం పడటంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. వందల ఎకరాల పంటలు నీట మునిగాయి. శివారు ప్రాంతాల కాలనీలు జలమయమయ్యాయి. కాలువలు, వంకలు ప్రవహించాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. గురువారం వాయుగుండం తీరం దాటడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. గత నాలుగు రోజులుగా జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 1100 హెక్టార్లలో మినుము, అలసంద, పొగనారు తదితర రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

2లో

- విశాలాంధ్ర బ్యూరో, ఒంగోలు :

ప్రజారోగ్యానికి పెద్దపీట

- రోగులకు మెరుగైన చికిత్సపై ప్రత్యేక శ్రద్ధ
- మంత్రి డోలా శ్రీ బాలవీరాంజేయ స్వామి
- ఆకస్మికంగా కలెక్టర్‌తో కలసి 'రిమ్స్' తనిఖీ

2లో

-విశాలాంధ్ర, ఒంగోలు :

బుజ్జగిస్తారా..మందలిస్తారా..

నేడు ఎమ్మెల్యేలు, ఎంపీలతో చంద్రబాబు సమావేశం

ఇసుక.. మద్యం... ఉద్యోగ బదిలీలపై ఫిర్యాదులు

ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు



2లో

-విశాలాంధ్ర బ్యూరో, ఒంగోలు :

చెత్త సంపద కేంద్రాలకు భూములు సేకరించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల :

మున్సిపాలిటీలలో చెత్త సంపద కేంద్రాలకు అవసరమైన భూమిని అధికారులు సేకరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటుతో కాలుష్యాన్ని నియంత్రించగలమని కలెక్టర్ తెలిపారు. బాపట్ల జిల్లాలోని నాలుగు పట్టణాలలో 9 ప్లాంట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బాపట్ల, చీరాల మున్సిపాలిటీలలో ఒక ఒక్కొక్క ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ భూమి ఉందని చెప్పారు. మిగిలిన ఏడు కేంద్రాలకు 14.82 ఎకరాల భూమి అవసరమన్నారు. బాపట్ల పట్టణంలో రెండు ప్లాంట్లకు 3.50 ఎకరాల భూమిని సేకరించాలన్నారు. చీరాల పట్టణంలో ఒక ప్లాంట్ ఏర్పాటు కొరకు రెండు ఎకరాలు, రేపల్లెలో రెండు ప్లాంట్ల కొరకు 4.89 ఎకరాలు, అద్దంకిలో రెండు ప్లాంట్ల కొరకు 4.50 ఎకరాల భూమి సేకరించాలన్నారు. చెత్త సంపద కేంద్రాల ఏర్పాటుతో పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచవచ్చన్నారు. ఇందుకొరకు అవసరమైన భూమిని సేకరించాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్, భూసేకరణ విభాగం పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేస్తాం

- అద్దంకి నియోజకవర్గం అభివృద్ధి చేస్తాం
- రూ.40 కోట్ల నిధులు మంజూరు
- మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - అద్దంకి :

అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కల నిజం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని గృహ నిర్మాణాలు చేపట్టి ఖాతాలో 1 రూపాయి జమ చేయబడిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వం నుండి నగదు జమ చేస్తామని విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గురువారం అద్దంకి మండలం,మోదేపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.30 లక్షల అంచనా వ్యయంతో సుమారు 800 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుండి వినతులు స్వీకరించి పరిష్కారమయ్యేలా సంబంధిత అధికారులను ఆదేశించారు. పలువురు నూతన వితంతు,వృద్ధాప్య పింఛన్ల కోరుతూ వినతులు అందించగా అతిత్వరలో నూతన పింఛన్ల అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఎక్కడ తట్ట మట్టి వేసిన పాపాన పోలేదని తిమ్మాయపాలెం నుండి ఇలపావులూరు వరకు రోడ్డు మరమ్మతులకు 70 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు, దీపావళి నుండి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు,గ్రామాలలో పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలని, ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో పరిసరాల శుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో 40 కోట్ల రూపాయల పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత జగన్ రెడ్డి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ మరుగున పెట్టిందని అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడే పేదవారికి దన్నుగా కుటుంబం నిలుస్తుందన్నారు, అలాగే రాష్ట్రాభివృద్ధి ప్రజాసంక్షేమం కోసం 7 హామీలు అమలు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగా 3వేల ఉన్న అవ్వతాతల పింఛన్‌ను రూ. 4000చొప్పున అందించడమే కాకుండా 3 నెలల బకాయిలను కలిపి అందించి ఇచ్చిన హామీని నెరవేర్చడం జరిగిందన్నారు.

విశాలాంధ్ర epaper.visalaandhra.com శుక్రవారం 18 । అక్టోబర్ । 2024

20న టి.కృష్ణ వర్ధంతి

విశాలాంధ్ర-ఒంగోలు : ఈనెల 20వ తేదీన సంచలన సినీ దర్శకులు, ప్రజానాట్యమండలి కళాకారులు టి.కృష్ణ 38వ వర్ధంతి కృష్ణ మెమోరియల్ కల్చరల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి, కృష్ణ మెమోరియల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ల ఆధ్వర్యంలో ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. టి.కృష్ణ వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 20వ తేదీన జిల్లాస్థాయి పాటలు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గాయకులు సినిమా, అభ్యుదయ, విడి పాటలు పాడవచ్చు అని తెలిపారు. మొదటి బహుమతి రూ.2వేలు 2000తో పాటు మెమెంటో, రెండవ బహుమతి రూ.15 వందలు పాటు మెమెంటో, తృతీయ బహుమతి రూ.వెయ్యి నగదు బహుమతితో పాటు మెమొంటో అందిస్తున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం బహుమతి ప్రధానం కూడా ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఉప్పుటూరి ప్రకాశరావు సెల్ నెంబర్. 9490 952 736ను సంప్రదించాలని కోరారు.

టంగుటూరు ఆలకూరపాడు మధ్య బ్రిడ్జిలను నిర్మించాలి

విశాలాంధ్ర-టంగుటూరు: టంగుటూరు ఆలకూరపాడు రహదారిలో కాలం చెల్లిన చప్టాల స్థానంలో బ్రిడ్జిలు నిర్మించాలని ఆలకూరపాడు గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు. మండల కేంద్రమైన టంగుటూరు నుండి ఆలకూరపాడుకు ఐదు కిలోమీటర్లు దూరం ఉంటుంది అయితే ఈ రహదారిలో ఆలకూరపాడు చేరుకోవడానికి నాలుగు చప్టాలు ఉన్నాయి. వర్షాకాలంలో ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. టంగుటూరు నుండి ఈతముక్కలకు వెళ్లాలంటే ఆలకూరపాడు మీదుగానే ప్రయాణించవలసి ఉంటుంది. ఈతముక్కల ఆలకూరపాడు మధ్యలో మూసి పై 40 సంవత్సరాల కిందట నిర్మించిన బ్రిడ్జి ఉంది వర్షాకాలంలో మూసిలోకి వరద వచ్చినప్పుడు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఈతముక్కల పరిసర ప్రాంతాల నుండి కూరగాయల వ్యాపారస్తులు చాపల వ్యాపారస్తులు ఆలకూరపాడు మీదుగా సింగరాయకొండ టంగుటూరు తదితర ప్రాంతాలకు వ్యాపార పనుల నిమిత్తం ప్రయాణం చేస్తూ ఉంటారు. భారీ వర్షాలు సంభవించినప్పుడు ఆలకూరపాడు నుండి ఈతముక్కల ఒంగోలు వెళ్లాలన్న టంగుటూరు చేరుకోవాలన్న పడమర వైపున మూసి పొంగి పొర్లుతూ ఉంటుంది టంగుటూరు వెళ్లాలన్న నాలుగు చట్టాలలో వరద ఇబ్బందికరంగా ప్రవహిస్తూ ఉంటుంది. ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా ఆలకూరపాడు ప్రజల పరిస్థితి తయారయ్యిందని చెపుతున్నారు.

బ్రిడ్జిలు నిర్మించాలి : ఆలకూరపాడు పంచాయతీ కార్యాలయం వద్ద 35 సంవత్సరాల క్రితం నిర్మించిన చట్ట కొద్దిపాటి వర్షానికి పంట పొలాల్లో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంటుందని భారీ వర్షాలు తుఫానులు సంభవించినప్పుడు నడుముల లోతు వరకు చప్టాపై నీరు ప్రవహించి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ఆలకూరపాడు ప్రజలు చెప్పున్నారు. అంతే కాకుండా టంగుటూరు సమీపంలో ఉన్న రెండు చప్టాలు ఇబ్బందికరంగా వరద ప్రవహించి రెండు మూడు రోజులు ఎటు వెళ్లలేని పరిస్థితిని ఉంటుందని విచారం వ్యక్తం చేస్తున్నారు.

తప్పిన ముంపు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటడంతో జిల్లాకు ముప్పు తప్పింది. నాలుగు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం పడటంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. వందల ఎకరాల పంటలు నీట మునిగాయి. శివారు ప్రాంతాల కాలనీలు జలమయమయ్యాయి. కాలువలు, వంకలు ప్రవహించాయి. ముందస్తు చర్యల్లో భాగంగా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. గురువారం వాయుగుండం తీరం దాటడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకున్నారు. గత నాలుగు రోజులుగా జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా 1100 హెక్టార్లలో మినుము, అలసంద, పొగనారు తదితర రకాల పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇంకా నేడు, రేపు పూర్తిస్థాయిలో ఎన్యుమరేషన్ చేసిన తరువాత పంటనష్టం ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. గురువారం వేకువజామువరకు జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోని చిన్నచిన్న వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ఎగువ నుంచి వరదనీరు రావడంతో గుండ్లకమ్మ ప్రాజెక్టు పూర్తిస్థాయి నిండింది. దీంతో అధికారులు నాలుగు గేట్లను ఎత్తి నీటిని సముద్రానికి వదిలారు. ఎగువనుంచి ఇంకా వరదనీరు వస్తూనే ఉంది. దీంతో ప్రాజెక్టు వద్ద అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి ఊపిరిపోసే విధంగా జిల్లాలో భారీగా వర్షపాతం నమోదు కావడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వ్యవసాయ రంగానికి ప్రయోజనకరంగా ఉంటుందని వెల్లడిస్తున్నారు. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు సింగరాయ కొండ, టంగుటూరు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఎత్తివేశారు. ముంపు గ్రామాల్లో బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు తదితర నిత్యావసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి వరదనైనా, ముప్పునైనా ఎదుర్కొనేందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ముందస్తుగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. కలెక్టర్, జేసీ గత నాలుగు రోజులగా ఒంగోలుతో పాటు టంగుటూరు, సింగరాయకొండ, నాగులుప్పల పాడు, కొత్తపట్నం మండలాల్లో పర్యటించి పరిస్థితులను అడిగి తెలుసుకొని ముందస్తు చర్యలు చేపట్టారు. మొత్తం మీద ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా పెను తుఫాను నుంచి జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా ఏవరేజ్ 29.3 మిల్లీమీటర్ల వర్షపాతం కాగా ఇప్పటి వరకు 30.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రజారోగ్యానికి పెద్దపీట

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధన్యతను ఇస్తూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. గురువారం మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దన్ రావు, నగర మేయర్ గంగాడ సుజాత, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ డా. నూకసాని బాలాజీ లతో కలసి ఒంగోలు లోని రిమ్స్ ను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపి గదులను, అత్యవసర సేవా విభాగంను, ఫిజియోథెరిపి యూనిట్ ను, బ్లడ్ కలెక్షన్ యూనిట్ ను, ఎన్టిఆర్ వైద్య సేవల కౌంటర్ ను, కాన్పులు, పిల్లల వార్డులను తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి నిర్వహణపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి, వైద్యులను ఆదేశించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, ఈరోజు జిల్లా కలెక్టర్, స్థానిక శాసన సభ్యులతో కలసి రిమ్స్ ను విజిట్ చేయడం జరిగిందని, సిబ్బందిలో కొంత అలసత్వం, పారిశుద్ధ్యంలో కొంత మేర లోపాలతో పాటు విధుల నిర్వహణలో సిబ్బంది మధ్య సమన్వయ లోపం కూడా గుర్తించడం జరిగిందన్నారు. ఈ లోపాలను సరిదిద్దుకొనుటకు కొన్ని సూచనలు కూడా చేయడం జరిగిందన్నారు. ప్రకాశం జిల్లాలో ప్రధానమైన ఈ ఆసుపత్రి కి దూర ప్రాంతాల నుండి కూడా ప్రజలు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారన్నారు. వైద్య సేవలు కూడా కొంత సంతృప్తిగా వున్నాయన్నారు. వార్డుల్లో వున్న లోపాలను పై స్థాయి అధికారులకు తెలియచేయడంలో సమన్వయ లోపం వుందన్నారు. రిమ్స్‌లో రోగులకు అవసరమైన రేర్ గ్రూపు లకు ప్రవేట్ బ్లడ్ బ్యాంకల నుండి సేకరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అన్నీ చర్యలు తీసుకునేలా ఆసుపత్రి సూపరింటెండెంట్ కు, వైద్యులకు అవసరమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. లోపాలను సరిదిద్దుకుంటూ మెరుగైన వైద్య సేవలు అందించేలా అన్నీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ, రిమ్స్‌లో ఓపి పెరిగేలా, మెరుగైన వైద్య సేవలు అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవడం జరుతుందన్నారు. గైనిక్ వార్డులను, కొన్ని విభాగాలను పరిశీలించడం జరిగింది. వైద్య సేవలు అందించడంలో సంతృప్తి గా వున్నప్పటికినీ, శానిటేషన్ సెక్యూరిటీ విషయాల్లో కొన్ని పిర్యాదులు రావడం జరిగిందని, వీటిని సరి చేయుటకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సూపరింటెండెంట్ కు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులకు అవసరమైన బ్లడ్ ను ప్రవేట్ బ్లడ్ బ్యాంకు లనుండి పొందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు.మంత్రి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డా దుర్గాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్స్ పాల్గొన్నారు.

బుజ్జగిస్తారా..మందలిస్తారా..

నేడు ఎమ్మెల్యేలు, ఎంపీలతో చంద్రబాబు సమావేశం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. గత ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలు, అవినీతి, అక్రమాలు, చోద్యంతో విసుగెత్తిపోయారు. ఇసుక, మద్యం దోపిడి జరిగింది. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. విభజన చట్టంలోని హామీలను మరిచారు. ఫలితంగా గత వైసీపీ ప్రభుత్వంపై జనం విసుగెత్తిపోయారు. దీంతో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. ఆ పార్టీ అధినేతలు కూడా ఊహించని విధంగా 175 ఎమ్మెల్యే స్థానాలకు గాను 164 స్థానాల్లో విజయకేతనం ఎగురవేశారు. ఇక రాష్ట్రానికి మహర్దశ పడుతుందని ఊహించారు. అయితే కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వంద రోజుల్లోనే తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలు ఊహించనిస్థాయిలో ఎక్కువగా వస్తున్నాయి. ముఖ్యంగా ఇసుక దోపిడి, మద్యం సిండికేట్‌లు, ఉద్యోగాల బదిలీల చేతివాటం ప్రధానాంశాలుగా చర్చ జరుగుతుంది. అంతేకాకుండా టీడీపీ శ్రేణులు దౌర్జన్యాలు, అరాచక చర్యలు ఇలా ఒకదాని తరువాత ఒకటి తెరమీదకు వచ్చి కూటమి ప్రభుత్వంపై వంద రోజులు పూర్తయిన వెంటనే విమర్శలు రావడం ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. దీంతో నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల పనితీరుపట్ల వారు చేస్తున్న వ్యవహారశైలిపై నిఘా వర్గాలు నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఇప్పటికే మీడియా ముందు పార్టీ నేతలకు హెచ్చరికలు జారీ చేసిన చంద్రబాబు నేడు నేరుగా వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలకు హితబోధ చేస్తారా... మందలిస్తారా అనేదానిపై విస్తృతంగా చర్చ జరుగుతుంది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి సారించాల్సిన గురుతర బాధ్యత వారిపై ఉంది. దానిని పక్కనపెట్టి ఆదాయ వనరులపై ఎమ్మెల్యేలు దృష్టి సారించారు అనేదానిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి టీడీపీ ఎమ్మెల్యేలకు ఆయన పదేపదే కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురాకుండా మంచిపేరు తీసుకురావాలని హెచ్చరిస్తూనే ఉన్నారు. వైసీపీ నేతల తరహాలో బరితెగింపు వద్దు బ్రదర్ అని తనదైన శైలిలో పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలకు చంద్రబాబు హెచ్చరిస్తున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి అప్రతిష్ట తెస్తే సహించేది లేదని ఇప్పటికే సంకేతాలు పంపారు. ఎంపీలుగా ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి ఆయా నియోజకవర్గాల్లో ఇసుక, ఉద్యోగ బదిలీలు, ప్రస్తుతం మద్యం టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎమ్మెల్యేల వ్యవహారశైలిపై చంద్రబాబు నాయుడు ఇంటలిజెన్సీ వర్గాల ద్వారా సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో నేడు టీడీఎల్‌పీ సమావేశం ఏర్పాటు చేసిన చంద్రబాబు వారి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేస్తారోనేదానిపై అందరిలో ఉత్కంఠ నెలకొంది.

గుండ్లకమ్మ నది ప్రవాహంలో వ్యక్తి గల్లంతు

విశాలాంధ్ర -ఒంగోలు : గుండ్లకమ్మ నదిలో ఈత కోసం దిగిన గంగిశెట్టి బ్రహ్మనాయుడు (31) అనే వ్యక్తి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు నదిలోకి ప్రవాహం పెరిగింది. ఈ నేపథ్యంలో గురువారం తన స్నేహితులతో కలిసి మద్దిపాడు మండలం రాచవారిపాలెం గ్రామంలో ఈత కోసం బ్రహ్మనాయుడు నదిలోకి దిగారు. ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు. గాలింపు చర్యలు చేపట్టమన్నారు. మృతునికి భార్య మౌనిక, కుమారుడు సిద్దార్థ వర్మ ఉన్నట్లు చెప్పారు. వర్షాల వల్ల నది ఉధృతంగా ప్రవ హిస్తున్నందున ఎవరూ ఈత కోసం నదిలోకి దిగవద్దని అధికారులు సూచించారు.

'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-కొమరోలు : కొమరోలు మండలంలోని అల్లినగరం, పాముర్రుపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కె రాజశ్రీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 2024-25 రబీ సీజన్ కి సంబందించి రాయితీ పై అందజేసే శనగ విత్తనాలు కోసం అన్ని రైతు సేవా కేంద్రాలు వద్ద రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అని తెలియజేసారు. శనగలో ఎండు తెగులు నివారించడానికి విత్తనాల్ని తప్పనిసరిగా కిలో విత్తనానికి 5 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి తో విత్తన శుద్ధి చేసుకోవాలని తెలియజేశారు. పట్టు పరిశ్రమ శాఖ సాంకేతిక సహాయకులు పాండు రంగారెడ్డి వివిధ రాయితీ పథకాల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్లినగరం ఎం.పి.టి.సి జాజం వెంకటరమణ, గ్రామ రెవెన్యూ అధికారి పి.రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు రమణమ్మ, కె.శిరీష మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రామాలు అభివృద్ధి బాటలో నడవాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : ప్రధానమంత్రి ఆదివాసి గ్రామ అభివృద్ధి ప్రణాళిక గ్రామ సభ పుల్లల చెరువు మండలం మురికిమల్ల పెంటలో సర్పంచ్ పెద్ద బాలు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ పెద్ద బాలు నాయక్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆర్థిక సహాయంతో ఐటిడిఏస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో లాంప్ మరియు హార్స్ స్వచ్ఛంద సేవా సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఎస్సీ, ఎస్టీల కుటుంబానికీ సొంతింటిని నిర్మించాలనే సంకల్పంతో 2016లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ పథకం ద్వార దేశవ్యాప్తంగా సొంతిల్లు లేని కుటుంబాలకు ఆయా స్వచ్ఛంద సంస్థల సహకారంతో మురికిమల్ల పెంటలోని మౌలిక వసతులను ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు. గ్రామ సర్పంచ్ పెద్ద బాలు నాయక్,లాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గుంటూరు పాల్, హార్స్ సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పెద్దదోర్నాల గ్రంథాలయం నందు గురువారం వాల్మీకి జయంతి వేడుకలను గ్రంథ పాలకుడు డి వెంకటసుబ్బారెడ్డి గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమమును పురస్కరించు కొని గ్రంథపాలకుడు డి.వెంకటసుబ్బారెడ్డి వాల్మీకి చిత్రపటమునకు పూలమాలవేసి ఘనముగా నివాళులు అర్పించడం జరిగినది. గ్రంథ పాలకుడు డి వెంకటసుబ్బారెడ్డి వాల్మీకి భారతీయ ఇతిహాస సాహిత్యములో అత్యంత ప్రముఖమైన మరియు ప్రాచీన కవి, ఆయనే తొలి కవి అనే కారణంగా ఆదికవి అని పిలుస్తారు. వాల్మీకి సంస్కృతంలో రాసిన రామాయణము ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధమైన కావ్యాలలో ఒకటి, అందుకే మనము తెలుగులో వాల్మీకి రామాయణము ప్రసిద్ధి చెందినదిగా చెప్పు కొనుచున్నారని తెలిపారు.

గుంతలు తీశారు..పూడ్చటం మరిచారు..

ప్రైవేట్ కమ్యూనికేషన్ కంపెనీ నిర్వాకం

విశాలాంధ్ర-మద్దిపూడి : మద్దిపూడి మండలంలోని ఎయిర్టెల్, టాటా,ఐడియా ప్రైవేట్ కమ్యూనికేషన్ వైర్లకు సంబంధించిన పైప్ లైన్ గుంటల కారణంగా రహదారి మార్జిన్లో ఇష్టానుసారంగా గుంటలు తీయడంతో ప్రతిరోజు ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల తీసిన గుంతలు అరకొరగా బూర్చడంతో నీళ్లు నిలువ చేరి రహదారి పక్కన మార్జిన్ అంత గోతులు మయంగా మారింది. ఈ కారణంగా ఆటోలు, ద్విచక్ర వాహనలు నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పది రోజులు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాలైన సంఘటన జరిగాయి. పొదిలి,కొండపి ఆర్ అండ్ బి శాఖఅధికారులు లంచాల మత్తులో పడి రహదారిని సందర్శించిన దాఖలాలు లేకపోవడంతో ప్రైవేటు కంపెనీలకు సంబంధించిన వ్యక్తులు ఇష్టరాజ్యంగా వివిధ చోట్ల గుంతలు తొవ్వి సరిగా పూడ్చటం లేదు. ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం పట్ల వాహనదారులు ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

పీఎన్‌సీలో దూరవిద్యా కోర్సులకు అనుమతులు

విశాలాంధ్ర-సింగరాయకొండ : సింగరాయకొండ మండల సోమరాజుపల్లి గ్రామ పరిధిలోని పి యన్ సి ఏ డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుండి పి యన్ సి ఏ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో పిజి నందు సైన్స్ కోర్సుల నందు ప్రభుత్వం నుండి అనుమతి మంజూరైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ గీతారాణి గురువారం ఒక ప్రత్యేక సమావేశంలో తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆమె మాట్లాడుతూ యం యస్ సి నందు కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ,బోటనీ, జువాలజీ, మేథమాటిక్స్, స్టాటిస్టిక్స్, మైక్రోబయాలజీ, సైకాలజీ మరియు ఫుడ్ మరియు న్యూట్రిషన్ సైన్స్ మొదలగు కోర్సులకు అనుమతి గలదని, ఆసక్తి గలవారు ఈనెల 31లోపు స్టడీ సెంటర్ నందు జాయిన్ కావచ్చని తెలిపారు. అలానే సైన్స్ తోపాటు బి ఏ, బి కామ్ నందు అన్ని సబ్జెక్టులు, యం కామ్ మరియు యం ఏ నందు అన్ని సబ్జెక్టులు కలవని ఆమె వివరించారు. ప్రమోషన్స్ కోరుకునే ప్రభుత్వ ఉద్యోగులు, గృహిణులు మరియు ఉన్నత విద్య చదవాలనుకునే ప్రైవేటు ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలియజేశారు.

వైసీపీ కార్యకర్తకు 'దద్దాల' పరామర్శ

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని నాగులవరం పంచాయతీ గుమ్మలకర గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త పొల్లబొయిన పెద్ద గురవయ్య (పెద్దన్న) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కనిగిరి హర్షిత హాస్పటల్ నందు చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ హాస్పటల్ నందు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు, రాజశేఖర్ రెడ్డి ముక్కు వెంకటేశ్వర రెడ్డి(సాయి పబ్లిక్ స్కూల్) ముక్కు మహేశ్వర్ రెడ్డి మద్ది కొండయ్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని బెల్టు షాపుపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించి ఒక మహిళ వద్ద ఉన్న 22అక్రమ మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి కిషోర్ బాబు తెలిపారు.

క్వార్టర్ మద్యం సీసాపై రూ.20లు అదనంగా వసూలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా టెండర్లను పిలిచి లాటరీ ద్వారా మద్యం షాపులను కేటాయించింది. దానిలో భాగంగా యర్రగొండపాలెం మండలానికి ఐదు షాపులు కేటా యించగా అందులో ఒక షాపును బుధవారం కొలుకుల సెంటర్‌లో ప్రారంభించారు. కొలుకుల వెళ్లే రహదారి నిత్యం వాహనాలతో, ప్రయాణికులతో రద్దీగా ఉటుంది. దీనికి తోడు అక్కడే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యూపి ఉర్దూ పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లాంటి విద్యా సంస్థలు ఉన్నాయి. ఆ ప్రాంతంలోనే నూతనంగా బ్రాందీషాపును ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంత ప్రజలు పెదవి విరుస్తున్నారు. దీనికి తోడుషాపును నూతనంగా ప్రారంభించడంతో మందుబాబుల సంచారం భారీగా పెరిగింది. ట్రాఫిక్‌కు సైతం జనసంచారం అంతరాయంగా మారింది. కాగా కొత్త ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకే పంపిణీ చేస్తారని భావించినప్పటికీ గత ప్రభుత్వంలోని పాత మద్యాన్నే విక్రయించి ప్రతి క్వాటర్ బాటిల్ పై అదనంగా రూ.20లు వసూలు చేస్తున్నట్లు మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా మద్యం షాపును నిత్యం రద్దీగా ఉండి, పాఠశాలలు ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేయడం సరైనది కాదని పలువురు అంటున్నారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : రూ.40లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు శంకుస్థాపన చేశారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా గురువారం యర్రగొండపాలెం మండలం నర్సాయిపాలెం గ్రామంలో రూ.20 లక్షలు, చిన్న బోయలపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు యర్రగొండ పాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు శంకుస్థాపన చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గ్రామ స్థాయిలో తీసుకున్న తీర్మానాలతో ఈ పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రాబోయే రోజులలో నియోజకవర్గంలో మరిన్ని రోడ్లను వేసి ప్రజల సౌకర్యార్థం రోడ్ల సమస్య లేకుండా చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఇంచార్జ్ ఎనుముల నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, నర్సాయిపాలెం సర్పంచి చిమట వెంకట రాములు, బోయలపల్లి సర్పంచి పాలడుగు వెంకట కోటయ్య, ప్రభుత్వ అధికారులు, టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : రామాయణం రూపకర్త వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ ప్రభుత్వం నిర్వహించడం అభినందనీయమని మండల టిడిపి నేతలు యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావులు అన్నారు. గురువారం స్థానిక మండల టిడిపి కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను మండ్ల రమణయ్య, మల్లికార్జున ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఫోర్మెన్ కమిటీ అధ్యక్షులు పద్దతి హరిష్, మాజీ సర్పంచ్ కావటి సుబ్బయ్య,మాజీ ఎంపీటీసీలు ఇద్రి కోటిరెడ్డి, ఉప్పల పాటి హరిబాబు, మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, షేక్ హజీగోస్ బాషా,షేక్ ఖాజా రహమతుల్లా, బత్తుల సత్యం గుత్తి మహేష్ షేక్ నాయిబ్ రసూల్ (కావేరి) శేషం మోషే కొండ నరసింహులు, మీనిగ శ్రీను, నల్లబోతుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలో రబీలో పప్పు సెనగ పంట సాగు చేసి రైతులకు 25 శాతం రాయితీపై పప్పు సెనగవిత్తనాలు అందజేయడం జరుగుతుందని, మండల వ్యవసాయ అధికారి కే ప్రసన్న రంగ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మండలంలోని పెదారికట్ల చింతకుంట్ల గ్రామాల్లోని రైతు కేంద్రాలను సందర్శించి రైతులకు పప్పుసెనగ విత్తనాలపై అవగాహన కల్పించారు. మండలానికి 269 క్వింటాళ్లు మంజూరయ్యాయని 25 శాతం రాయితీ పోను 7050 రూపాయలు రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. కావలసిన రైతులు ముందుగా ఆయా రైతు సేవా కేంద్రాల్లో వారి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

పదవ తరగతి ధ్రువపత్రం మరియు పాస్‌పోర్టు పోయినది

ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన **బొట్ల కార్తీక్ బాబు, తండ్రి మోహన రావుకు** చెందిన పదవ తరగతి ధ్రువపత్రం **సెప్టెంబర్ 8వ తేదీన** ముండ్లమూరు నుండి భీమవరం గ్రామానికి బస్సులో వెళ్తున్న సందర్భంగా పోయినది. **2012-2013** విద్యా సంవత్సరంలో తాళ్లూరులోని సరస్వతి హైస్కూల్ నందు చదువుకున్న నాకు చెందిన మార్కుల లిస్టు **హాల్ టికెట్ నెంబర్: 1316110542** మరియు పాస్‌పోర్టు పోయినది. పాస్‌పోర్ట్ నెంబర్ **W9364004** పోయినది. ఈ పాస్‌పోర్ట్ మరియు పదవ తరగతి మార్కులలిస్టు ఎవరికైనా దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

బొట్ల కార్తీక బాబు, తండ్రి మోహనరావు,
భీమవరం (గ్రామము, పోస్టు)
ముండ్లమూరు (మండలం), ప్రకాశం జిల్లా
మొబైల్ నెంబర్: 7899262122

విశాలాంధ్ర epaper.visalaandhra.com శుక్రవారం 18 । అక్టోబర్ । 2024

పులి వాగును పరిశీలించిన జేసీ

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని బాదినేని పల్లె గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పులి వాగును జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆకస్మిక తనిఖీ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి వాగు దాటే సాహసం ఎవరు చేయవద్దని తెలిపారు. మరో రెండు రోజులపాటు అల్పపీడనం ధోరణి కొనసాగుతుందని, ప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తగా ఉండాలని అక్కడ పరిస్థితులను అధికారులను స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండల కేంద్రమైన పెద్ద ధర్నాలోని నటరాజ్ సెంటర్లో వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. నటరాజ్ సెంటర్లో వాల్మీకి విగ్రహానికి, స్థానిక ఎస్సైవి మహేష్, పూలమాల వేసి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. అలాగే మండల టిడిపి నాయకులు, వాల్మీకి నాయకులు, జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వాల్మీకి ఒక గొప్ప వ్యక్తి అని, కొనియాడారు. ఆర్ఐ మండ్ల ప్రసాద్, టీడీపీ కన్వీనర్ ఏరువా మల్లికార్జునరెడ్డి బట్టు సుధాకర్ రెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు బీ.పుల్లయ్య,శీను,మండ్ల రమణయ్య మండ్ల వెంకటరంగయ్య స్వామి మీనిగా కాశరాములు తోకల వెంకటేశ్వర్లు భోగ్యం.వెంకటేశ్వర్లు వాల్మీకి సంఘ నాయకులు భోగ్యం. పుల్లయ్య మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వాల్మీకులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని,100 కోట్ల నిధులతో మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నాయకులు అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై దృష్టి సారించాలి

- త్రిపురాంతకం సీఐ జి.అస్సాన్

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలో పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి సారించాలంటూ త్రిపురాంతకం సీఐ తెలిపారు. సామాజిక తనిఖీలో భాగంగా దొనకొండ స్టేషన్ సందర్శనకు వచ్చిన ఆయన స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులపై దృష్టి సారించాలంటూ సిబ్బందికి సూచించారు. గంజాయి అమ్మకం, బెల్టు దుకాణాలు, ఆరుబయట మద్యం సేవించటం, మద్యం సేవించి వాహనాలు నడపటం, హెల్మెట్ ధరించటం, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించటం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి కట్టడి చేయాలన్నారు. సిబ్బంది పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ సందర్శనకు విచ్చేసిన సీఐ అస్సాన్‌కు స్థానిక ఎస్ఐ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గౌరవ స్వాగతం పలికారు.

గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ

కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

విశాలాంధ్ర-పీసీపల్లి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలు అభివృద్ధి చేయడానికే పల్లె పండుగ ప్రగతికి అండగా పంచాయితీ వారోత్సవాలు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని గాంధీజీ కలగన్న గ్రామ స్వరాజ్యాం సాధించడం కోసమే పల్లె పండగ నిర్వహిస్తున్నట్లు కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని నేరేడుపల్లి మురుగమ్మి పంచాయితీలోని జంగాలపల్లి పిపిపల్లి గ్రామపంచాయితీలలో సిసిరోడ్ల నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నివాసం ఉంటున్న కుంటుంబాలకు ఏడాదిలో కనీసం వంద రోజులు వేతన ఉపాధి మెరుగైన జీవనోపాధి కల్పన చేశామని చెప్పారు. పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధులను విడుదల చేసిందని తెలిపారు. గత వైసిపి పాలనలో ఐదేళ్లపాటు గ్రామీణ ప్రాంతాలు కనీస మౌలిక సదుపాయాలుకు నోచుకోక అధ్వాన పరిస్థితికి చేరుకున్నాయని విమర్శించారు. గ్రామాల్లో తాగునీరు విద్యుత్ రహదారులు వంటి కనీస మౌలిక సదుపాయాలుకూ నోచుకోకపోవడంతో ప్రజలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొన్నాయని చెప్పారు. పల్లెలకు పూర్వ వైభవం తెచ్చేందుకే పల్లె పండగపేరుతో కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. పీసీపల్లి మండలానికి సంబంధించి నేరేడుపల్లి పంచాయతీలో రూ 20 లక్షలు మురుగమ్మి పంచాయతీ పరిధిలోని జంగాలపల్లిలో రూ 15 లక్షలు పీసీపల్లి పంచాయతీలో రూ 1.90 కోట్లతో సిమెంటు రోడ్లు కాలువలు ఇతర పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.

శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

పిసిపల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఓ మోస్తారు వర్షం కురిసినా కార్యాలయం మొత్తం కారుతుండడంతో గురువారం స్థానిక శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కార్యాలయాన్ని పరిశీలించి తక్షణమే కార్యాలయాన్ని పీసీపల్లి సచివాలయంలోకి మార్చాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఉగ్ర వెంట మండల టీడీపీ, జనసేన బిజెపి పార్టీల ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

కుక్కల బెడదతో భయం భయం

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల బెడదతో ప్రజల భయభ్రాంతులకు గురి అవుతున్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. రాత్రి సమయంలో గృహంలోంచి బయటకు రావాలంటే ప్రజలు సందేహిస్తున్నారు. వీధిలో చిన్న పిల్లలు వృద్ధులు చదువుకునే విద్యార్థులు అనేకులు ఉన్నారని ఎప్పుడు ఎవరిపై కుక్కల దాడి చేస్తావని ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు స్థానికులు వాపోతున్నారు అధికారులకు పాలకులకు ఎన్నిసార్లు చెప్పిన వద్దీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు కనుక సమ్మతిత అధికారులు స్పందించి వీధి కుక్కలను పట్టుకుని ప్రజలకు భద్రత కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జీవీ అరవిందకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-పామూరు : మండల కేంద్రమైన పామూరు మేజర్ పంచాయితీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన జీవీ అరవింద్ ను గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ మర్యాదపూర్వకముగా కలిశారు. ఈ సందర్భంగా రెండవ ఎంపీటీసీ పరిధిలోని సమస్యలను కార్యదర్శి అరవింద్ దృష్టికి ఎంపీటీసీ వెంకటేష్ తీసుకువెళ్లారు. కార్యక్రమంలో నీరుకట్టు నాయబ్ రసూల్, ఆవుల నారాయణ, ఇండ్ల నరసింహారావు, పుప్పాల రామ్మూర్తి, షేక్ చాంద్ బాషా తదితరులు ఉన్నారు.

కంది, మిరప రైతుల హర్షం

విశాలాంధ్ర-కొండపి : తుపాను ప్రభావంతో మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం రైతులు వేసిన పంటలకు లభించింది. ఈనెల 15న 78 మిల్లీమీటర్లు, 16న 98 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన 1640 హెక్టార్ల కంది పంటకు, 35 హెక్టార్ల మిరప పంటకు వర్షం ఎంతో ఉపయోగపడిందని వ్యవసాయ శాఖ అధికారి డి విజయ్ కుమార్ తెలిపారు. అదేవిధంగా పశుగ్రాసం సాగు చేసుకున్న రైతులకు సైతం వర్షం ఉపయోగపడిందన్నారు. పంటల్లోలోతట్టున నిలిచిన

వర్షపు నీటిని రైతులు బయటకు పెట్టుకోవాలని సూచించారు. అదేవిధంగా కొండపి వ్యవసాయ చెరువుకు సైతం వర్షం నీరు చేరింది. పొగ నాట్లు వేసుకునే రైతులకు సైతం అక్కడక్కడ బురద యాత పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా కుంటల్లో వాగుల్లో వర్షం నీరు చేరడంతో భూగర్భ జలాలు సైతం పెరిగే అవకాశం ఉందని నీటి కొరత సమస్య తీరుతుందని అధికారులు తెలిపారు.

గ్రానైట్ అక్రమ రవాణా నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం

- **ప్రభుత్వం మారిన తీరు మారని అధికారుల వ్యవహారం**
- **పీసీసీ అధికార ప్రతినిధి, డీసీసీ అధ్యక్షులు షేక్ సైదా**

విశాలాంధ్ర-ఒంగోలు : ప్రకాశం జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణాపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని ఆయన అన్నారు. గత 5 సంవత్సరాలలో గ్రానైట్ అక్రమ రవాణా ద్వారా వందలు కోట్లు రూపాయలు అధికార పార్టీ

నాయకులు, అధికారులు దండుకున్నారని ఆయన అన్నారు.గ్రానైట్ అక్రమ రవాణా ద్వారా వందల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందని ఆయన అన్నారు . మైనింగ్ మాఫియా ప్రపంచ ప్రసిద్ధి చెందిన చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ ను 45 గ్రానైట్ క్వారీల ద్వారా అధికారికంగా రోజుకి 300 వాహనాల ద్వారా 3200 క్యూబిక్ మీటర్ల గెలాక్సీ గ్రానైట్ రాయినీ తరలిస్తున్నారని అలాగే అనధికారికంగా మరో 3000 క్యూబిక్ మీటర్ల గ్రానైట్ రాయి అక్రమ తరలింపు జరుగుతుందని సైదా అన్నారు.ప్రభుత్వం మారిన మైనింగ్ మాఫియాకు అడ్డుకట్టు వేయలేదని అధికారుల తీరు మారలేద నీ,ఎలాంటి అనుమతులు లేకుండా అత్యంత ఖరీదైన చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ ని కొండలను పిండి చేసి మైనింగ్ మాసియా క్వారింగ్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.అక్రమార్జనకు అలవాటు పడి మైనింగ్ మాఫియా కి సహకరిస్తున్న మైనింగ్, వాణిజ్య, ట్రాన్స్పోర్ట్, రెవిన్యూ, పోలీస్ యంత్రాంగమని సైదా అన్నారు. విజిలెన్స్ చేత విచారణ జరిపించి మాఫియాకు ఎన్డీఏ ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని కాంగ్రెస్ పార్టీ కోరుతుందనీ మైనింగ్ మాఫియాకు సహకరిస్తున్న అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని సైదా అన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్రంలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కూటమి ప్రభుత్వ ధ్యేయమని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ఐదేళ్ల పాటు వైకాపా విధ్వంస పాలన కొనసాగిన తర్వాత , మళ్ళీ మన గ్రామాలు అభివృద్ధి బాట పడుతున్నాయని తెలిపారు. పల్లె పండుగ - ప్రగతికి అండగా వారోత్సవాలలో భాగంగా చీరాల మండలం ఈపురు పాలెం, గవినివారిపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గ్రామసభలు నిర్వహించి, అభివృద్ధి పనుల కోసం పల్లె పండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. గ్రామ స్వరాజ్యం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. సంక్రాంతి లోపు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు పూర్తిచేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని స్పష్టం చేశారు. గత వైకాపా ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివసుబ్రమణ్యం, రామ క్రిష్ణ, బండారు మురళీ బాపూజీ, అధికారులు, సిబ్బంది, గంజి పురుషోత్తం, గుద్దంటి చంద్రమౌళి, స్థానిక తెదేపా, జనసేన, భాజపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-పర్చూరు: పల్లె పండగ కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులకు గ్రామాల్లో శంకుస్థాపనలు జరుగుతున్నాయని ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. మండలంలోని నాగులపాలెం, నూతల పాడు, రమణాయపాలెం గ్రామాల్లో పల్లె పండగ- పంచాయతీ వారోత్సవాలలో భాగంగా గ్రామసభలు జరిగాయి. ఈఓఆర్డీ కొసనా సత్యనారాయణ, ఏఈ శ్రీనివాసరావు, ఏపీఓ బుల్లియ్య, టీడీపీ నాయకులు ఉన్నారు.

అనాధ పిల్లలకు ఆశ్రయం కల్పించటమే ధ్యేయం

విశాలాంధ్ర - పర్చూరు : అనాధ పిల్లల కోసం స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేయటం అభినందనీయమని వైసీపీ నాయకులు దీపక్ తెలిపారు. గ్లోరియస్ చారిటబుల్ సొసైటీని గురువారం దీపక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అనాధ పిల్లల ఆశ్రయం తో పాటు విద్యాభివృద్ధికి తోడ్పడటం మంచి పరిణామని, సొసైటీ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతపరచాలని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు మాచవరపు రవి కుమార్, గేరా స్వరాజ్, కట్టా రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సహాయ

-15100 నెంబర్‌కు ఫోన్ చేయండి

- రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - రేపల్లె : జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అందరికీ అందుబాటులో ఉచిత న్యాయానికి కృషి చేస్తున్నదని రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రేపల్లె తాలూకా ఆఫీస్ ఆవరణలో గల ప్రతి ఆఫీసు నందు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన స్టిక్కర్లను సీనియర్ సివిల్‌జడ్జి ఆవిష్కరించారు. ఉచిత న్యాయ సహాయానికై 15100కు ఫోన్ చేసి ఉచిత సహాయం పొందవచ్చునని తెలిపారు.

పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలు

నల్లపునేని రంగయ్య చౌదరి

విశాలాంధ్ర - యద్దనపూడి : పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలని మండల టీడీపీ అధ్యక్షులు నల్లపునేని రంగయ్య చౌదరి అన్నారు. మండలంలోని,జాగర్లమూడి, తనుబొద్దువారిపాలెం గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సిసి రోడ్లకు, గోకుల షెడ్లకు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను ప్రతిష్టాత్మక నిర్వహిస్తుందని, రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టిందని అన్నారు. గత ఐదు సంవత్సరాలలో వైసీపీ ప్రభుత్వం విధ్వంస పాలనలో అభివృద్ధి కి నోచుకోలేదని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయని, గత ఆగస్టు నెలలో నిర్వహించిన గ్రామసభలలో ఆమోదించిన పనులకు సంబంధించి పనుల ప్రారంభించడం జరిగిందని అన్నారు. సీసీరోడ్లు, గోకుల షెడ్లకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకట్ స్వామి,ఎంపీడీవో షేక్ మహమ్మద్ అఖిబ్ జావిద్, డిఈఈ, ఈఓపిఆర్‌డి, ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ఏలూరి

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని అనంతవరం గ్రామానికి చెందిన గుద్దే శ్రీనివాసరావు కుమారుడి వివాహానికి హాజరైన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇంజనంపాడు గ్రామానికి చెందిన సాధినేని ఆది బాబు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుదె తారక రామారావు, కామేపల్లి హరిబాబు, గుదే బ్రదర్స్, కొరటాల వంశీకృష్ణ, నిమ్మల సాంబశివరావు, పెదవలి వెంకటేశ్వర్లు, పడవలా ఆంజనేయులు పోపూరి హనుమంతరావు, సాదినేని రంగారావు, సుధీర్, తదితరు నాయకులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

సీసీరోడ్లకు శంకుస్థాపన

విశాలాంధ్ర-సంతనూతలపాడు : గ్రామలఅభివృద్ధికి రాష్ట్ర కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ వార్షికోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుమ్మలంపాడు గ్రామంలో 20 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డులకు శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ ప్రారంభించారు. రాష్ట్ర టీడీపీ సెక్రటరీ ఆడకా స్వాములు మాజీ జెడ్పిటిసి తన్నీరు శ్రీనివాసరావు బాపట్ల పార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంప తోటి అంకారావు బాపట్ల పార్లమెంట్ రైతు అధ్యక్షులు నెప్పలి సుబ్బారావు టిడిపిమండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: కమిషనర్

కూరగాయల మార్కెట్‌ను మునిసిపల్ కమిషనర్ పరిశీలన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మునిసిపల్ కమీషనర్ జి. రఘునాథ రెడ్డి పర్యటించారు. కూరగాయల మార్కెట్‌ని పరిశీలించి వ్యాపారులతో మాట్లాడారు. కూరగాయ షాపు యజమానులు వారి సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానన్నారు. మార్కెట్ మొత్తం పరిశీలించి ఖాళీగా వున్న దుకాణాల వివరాలు, రెవెన్యూ ఆఫీసర్ వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 3వ వార్డు యానాది సంఘం, రాజీవ్ గాంధీ కాలనీ, 7 వ వార్డు వెన్నెలకంటి నగర్,శారదా పురి కాలనీ, 11 వ వార్డు ఇందిరానగర్ కాలనీల నందు అధిక వర్షాల కారణంగా నిలిచియున్న వర్షపు నీటి తరలింపు ని దగ్గరుండి పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా సాధ్యమైనంత త్వరగా నీటిని తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. 11 వార్డు ఇందిరానగర్ నందు వీధులను ఆయన పరిశీలించారు. పారిశుధ్యం, తాగునీరు సరఫరా విషయమై అక్కడి ప్రజలతో మాట్లాడి వారికి కొన్ని సూచనలు చేశారు. రైల్వే స్టేషన్ ఎదురు చంద్రకళా పార్క్ లో కొన్ని రోజులుగా వాడుకలో లేని సులభ కాంప్లెక్స్ ని పరిశీలించి వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసురావాలని ఆదేశించారు.ఆయనతో పాటు అసిస్టెంట్ ఇంజనీర్ జి.ఉమా మహేశ్వరరావు, రెవెన్యూ అధికారి,షేక్ జబ్బార్,శానిటరి ఇనిస్పెక్టర్ శ్రీనివాసరావురావు , మునిసిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరవపల్లిలో 'పల్లె పండుగ'

విశాలాంధ్ర - రేపల్లె : గ్రామస్వరాజ్యం దిశగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎంపీడీవో ఎం.శోభారాణి తెలిపారు. పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల్లో భాగంగా రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలో సీసీరోడ్లు, బోర్లు వంటి తదితర అభివృద్ధి పనులకు ఎంపీడీవో ఎం శోభారాణి గురువారం భూమి పూజ చేశారు.ఈ సంధ్బంగా గ్రామ పరిపాలనపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఎంపీడీవో ఎం.శోభారాణి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానంతో చేపడుతున్న పనులతో గ్రామాలు అభివృద్ధి జరగనున్నాయని వివరించారు. అభివృద్ధి పనులకు అధికారిక, సాంకేతిక అనుమతులు మంజూరు చేశామన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, బోర్లు, స్మశాన వాటికలను, అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. అలాగే పశు పోషకులకు చేయూత నివ్వడానికి గోకులాల షెడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. 20వ తేదీ వరకు గ్రామాలలో పండుగ వాతావరణం కల్పించడానికి పంచాయతీ వారోత్సవాలను ప్రభుత్వంనిర్వహిస్తున్నదన్నారు. ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారని, అధికారుల పర్యవేక్షణలో పనులు సాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలోఅరవపల్లి గ్రామ సర్పంచ్ లోయ బాబు,నాంచారయ్య, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె సబ్ డివిజన్ పోస్టల్ ఏఎస్‌పి ఏడుకొండలు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని పోస్ట్ ఆఫీస్‌ల్లో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలనిరేపల్లెసబ్ డివిజన్ పోస్టల్ శాఖ ఏఎస్పి కే ఏడుకొండలు కోరారు. రేపల్లె మండలం పేటేరు గ్రామంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోస్ట్ ఆఫీస్ లో అమలవుతున్న వివిధ పథకాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు అవగాహనకల్పించేశిబిరాన్నిఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ లో ఖాతా ఉన్నప్రతి ఒక్కరికి ఆధార్అనుసంధానం చేయడం జరుగుతున్న దని దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలునేరుగాఖాతాదారుని ఖాతాలోకి జమ అవుతాయన్నారు. పోస్ట్ ఆఫీస్ లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోస్టల్ ఇన్సూరెన్స్ నందు క్యాట్ పథకం కింద ఖాతాదారుడు ప్రతినెల 740. రూపాయలు ప్రీమియం చెల్లిస్తే ప్రమాదవశాత్తు అనుకోని సంఘటన జరిగి మరణించినట్లయితే 15 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ క్లైమ్ లభిస్తుందని తెలిపారు. అదేవిధంగా 549 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే 10 లక్షల రూపాయలు ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబానికి ఇన్సూరెన్స్ కింద కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. కావున ప్రజలు పోస్ట్ ఆఫీస్ నందు తమ ఎకౌంటు లను ప్రారంభించుకుని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పొందవలసిందిగా ఆయన ఖాతాదారులను కోరారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేశామని చందోలు ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నవంబరు నెలలో పిట్టలవానిపాలెం గ్రామంలో కల్లేపల్లి శ్రీనివాసరాజు బంధువుల ఇంట్లో పొన్నూరుకు చెందిన షేక్ కరీముల్లా ఏ తుకడా అనే వ్యక్తి చొరబడి సోనీ కలర్ టీవీ, 2 సవర్ల బంగారు గొలుసును దొంగతనం చేశాడు. బాధితుడు కల్లేపల్లి శ్రీనివాస రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి గురువారం నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి సోనీ కలర్ టీవీ, 2 సవర్ల బంగారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని గెలిపించాలి

- వేమూరు వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

విశాలాంధ్ర - రేపల్లె : రాబోయే కృష్ణ-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని వేమూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వరికూటి అశోక్ బాబు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక లక్ష్మీ గణపతి కళ్యాణ మండపంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్ రెడ్డి పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాటం చేసేటువంటి యోధుడు గౌతమ్ రెడ్డి అని ఆయనను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వైసీపీ సానుభూతి పరులైన పట్టభద్రులను ఓటరుగా చేర్చాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణ,గుంటూరు జిల్లాల్లో గత ఎన్నికల్లో ఓటమి చెందామని అయినప్పటికీ ఎమ్మెల్సీగా గెలవడం ద్వారా వైసీపీ బలాన్ని నిరూపించినవార వుతామన్నారు. ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. చుండూరు ఎంపీపీ జాలాది రూబెన్, మాజీ ఎంపీపీలు పెరికల పద్మారావు,ఉయ్యూరు అప్పిరెడ్డి, విష్ణు మొలకల వెంకటరెడ్డియ్య , కోగంటి లవ్ కుమార్, కొండా శివప్రసాద్ రెడ్డి, బొల్లి ముంత ఏడుకొండలు, భట్టిప్రోలు ఎంపీపీ లలిత కుమారి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టుబడిన అక్రమ మద్యం ధ్వంసం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలో వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన అక్రమ మద్యాన్ని ధ్వంసం చేసినట్లు బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. చందోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన 222 అక్రమ మద్యం సీసాలను గురువారం స్థానిక చందోలు పోలీస్ స్టేషన్లో బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ సమక్షంలో ఎస్ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యాన్ని రవాణా చేసిన, అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపిన అట్టివారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విశాలాంధ్ర - నిజాంపట్నం : రామాయణ మహా గ్రంథాన్ని రచించిన మహోన్నతమైన వ్యక్తి వాల్మీకి మహర్షి అని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఎంపీడీఓ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాల్మీకి రామాయణ మహా గ్రంథాన్ని రచించి ఆదికవిగా పేరుగాంచారన్నారు. వాల్మీకి జీవితం నేటి సమాజానికి ఆదర్శమని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ, సచివాలయం కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిజాంపట్నం పంచాయతీ కార్యాలయంలో....

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం నిజాంపట్నం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి మోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి సర్పంచ్ కట్టా పోలేరమ్మతో కలిసి కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, 104 వైద్యులు డాక్టర్ కె.గోపీనాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సీనియర్ నాయకులు ఖాదర్ బాబు, సచివాలయం కార్యదర్శులు జమీర్, రమేష్, హుస్సేన్, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో....

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : శ్రీరాముని పితృ వాక్య పరిపాలన, గుణగణాలను విశ్లేషిస్తూ రామాయణమును రచించిన వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర వేడుకగా నిర్వహించడం ముదావహమని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రసూన రాణి పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ శ్రీరాముడి చరిత్ర ప్రతి విద్యార్థికి ఆదర్శనీయం కావాలన్నారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే. శ్రీ వాసులు, డాక్టర్ టి. మధుమతి, డాక్టర్ సి. సంధ్యా రాణి, డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ వి. జ్యోతి, డాక్టర్. కె విజయ ప్రకాష్, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

చీరాలలో...

విశాలాంధ్ర - చీరాల : భారతీయ ఇతిహాస సాహిత్యంలో అత్యంత ప్రముఖమైన ప్రాచీన కవి వాల్మీకి అని,ఆయనే తొలి కవి అనే కారణంగా ఆదికవి అని ప్రజలు పిలుస్తారని చీరాల శాఖ గ్రంథపాలకురాలు దనమ్మ అన్నారు. గురువారం ఆయన వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ధనమ్మ మాట్లాడుతూ వాల్మీకి సంస్కృతంలో రాసిన

రామాయణం ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధమైన కావ్యాలలో ఒకటని వాల్మీకి జీవితం కూడ చాలా ఆసక్తికరమైనదన్నారు. ఈ కార్యక్రమంలో పి. హరిప్రసాద్,విద్యార్థులు పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో....

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మండల పరిషత్ కార్యాలయ నందు వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఎం.శోభారాణి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. కృషి ఉంటే మనుషులు ఋషులు అవుతారని వాల్మీకి మహాముని నిజం చేశారని ఎంపీడీవో శోభారాణి అన్నారు. ప్రభుత్వం వాల్మీకి జయంతిని అధికారికంగా ప్రకటించడం సంతోషకరమైన విషయం అన్నారు . ఏవో రమేష్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, మూర్తి, స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కోఆర్డినేటర్ ఎర్రగళ్ల నాగలక్ష్మి, కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

అధికారులు జవాబుదారీగా సేవలు అందించండి

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - కర్లపాలెం : అధికారులు జవాబుదారీగా ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. కర్లపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ అధికారులు తీసుకుని జీతం ప్రజల ఇస్తున్నదిగా గుర్తించుకుని వారికి విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను సక్రమంగా వివరిస్తూ ప్రజల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. ప్రజలు ఫోన్ చేసినప్పుడు స్పందించాల్సిన బాధ్యత ఉందనే విషయాన్ని గ్రహించాలన్నారు. చాలా మంది అధికారులు స్పందించటం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని పద్ధతి మార్చుకోకుంటే మరో ప్రాంతానికి వెళ్లిపోలని హెచ్చరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా ప్రతి అధికారి నిబద్ధతతో పని చేయాలన్నారు. గత ప్రభుత్వంలో అధికారులు ప్రజాప్రతినిధులు అందరూ కలిసి ఇష్టానుసారంగా వ్యవస్థలను నాశనం చేసి నిధులు దోచుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, తహశీల్దారు సుందరమ్మ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు తదితరులున్నారు.

జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి

- కలెక్టర్ ఏపీడబ్ల్యూజే నేతలు వినతి

విశాలాంధ్ర - బాపట్ల : జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని ఏపీడబ్ల్యూజే నేతలు కలెక్టర్ వెంకటమురళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్లుజే జిల్లా అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వంలో జర్నలిస్టు పిల్లల చదువు నిమిత్తం అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ అందించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా అన్ని ప్రైవేట్ పాఠశాలలకు ఆదేశాలు అందించి జర్నలిస్టుల యొక్క సంక్షేమం కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్‌కి విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గొర్ల శ్రీనివాసరావు, కాగిత ప్రశాంత్ రాజు, సుభాష్‌చంద్రబోస్ తదితరులున్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

విశాలాంధ్ర - బాపట్ల : రైతులు ముందస్తు ప్రణాళికతో రైతు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి .శివన్నారాయణ అన్నారు. గురువారం ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల ఏరువాక కేంద్రం కార్యాలయాన్ని సందర్శించిన శివన్నారాయణ వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంవత్సరం కార్యా లయ కార్యాచరణ గురించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆయన జమ్ములపాలెంలో వరిపొలాలని సందర్శించి రైతులకు తగు సలహాలు సూచనలు చేశారు. ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ బాల మురళీధర్ నాయక్, ఏరువాక కేంద్ర విస్తరణ విభాగ సైంటిస్ట్ డాక్టర్ ఎం.ఉష పాల్గొన్నారు.

గ్రామాలాఅభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

విశాలాంధ్ర-సీఎస్‌పురం : గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పల్లెపండగ ప్రగతి అండగా పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన సీఎస్‌పురంలో మూడు కోట్ల రూపాయల సిమెంటు రోడ్డుకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెపండుగ పంచాయితీ వారోత్సవాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసిందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు కనీస మౌలిక వసతులకు నోచుకోక గ్రామాల్లో అధ్వాన్న పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వ హయాంలో తాగునీరు, విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని అన్నారు. గ్రామాల్లో పూర్వ వైభవం తెచ్చేందుకు పల్లెపండుగ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా సీఎస్‌పురం టౌన్‌కు మొదటి విడతగా మూడు కోట్ల రూపాయలు సిమెంటు రోడ్లకు ఇచ్చామని, సిమెంటు రోడ్లకు నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ మంజునాధరెడ్డి, గ్రామ సర్పంచి శ్రీరాం పద్మావతి, బీజేపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కొండిశెట్టి రమణయ్య, మండల బీజేపీ పార్టీ అధ్యక్షులు ఇండ్లా వెంకటసత్యం, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, టీడీపీ నాయకులు నాగిశెట్టి చినమాలకొండయ్య, పునుగుపాటి రవికుమార్, పాలకొల్లు వెంకటరెడ్డి, చెరుకుపల్లి వెంకటరెడ్డి, బత్తుల రమణయ్య, రమేష్, కంచర్ల సత్యం, మన్నేపల్లి శ్రీనివాసులు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గురుకృష్ణ, పఠాన్ నాయబ్‌రసూల్, షేక్ మహబుబ బాషా, మాల్యాద్రి, గుర్రం వెంకటేశ్వర్లు, మన్నేపల్లి కార్తీక్, షేక్ ఖలీల్‌బాషా, తిరుపతయ్య, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ మండల కన్వీనర్ ఎండీ అఫ్జల్ అన్నారు. గురువారం మండలంలోని చందోలు గ్రామంలో నిర్వహించిన "పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు" కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అయన హాజరై గ్రామంలోని నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటు మైనార్టీ అధ్యక్షుడు ఎండి ఖాసిం, గ్రామ పార్టీ అధ్యక్షుడు రజాక్, తెదేపా నాయకులు నిజాం, మీరా, ఆరిఫ్, ఎంపీడీవో సత్యనారాయణ, ఈవోపిఆర్డి ఎలీషా బాబు, మండల అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సగిలేరును పరిశీలించిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-గిద్దలూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ప్రస్తుతం గిద్దలూరులో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో. గురువారం మార్కాపురం సబ్ కలెక్టర్ సహధిత్ వెంకట త్రివినాగ్ గిద్దలూరులోని సగిలేరు వాగు పరివాహ ప్రాంతాలను పరిశీలించారు. సగిలేరు వాగుకు సంబంధించి పూర్తి వివరాలను గిద్దలూరు ఎమ్మార్వో ఆంజనేయ రెడ్డి సబ్ కలెక్టర్ కు వివరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుఫాన్ వల్ల పరిస్థితులను ఎదురుకోవడానికి సిద్ధంగా ఉండాలని సబ్ కలెక్టర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ వైపి రంగయ్య పాల్గొన్నారు.

మోహన్‌రావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల మేజర్ పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా బదిలీపై వెళ్తున్న మోహన్ రావుకు, దోర్నాల సర్పంచ్ చిత్తూరి హారిక, మరియు వైసిపి మండల కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి, మరియు ఎంపీపీ భర్త గుమ్మ పద్మజ యల్లేష్ ,మండల ప్రజలు గురువారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషోర్, సుబ్బా నారాయణ,ఒంటెరు రవణ, బోళ్ల బాలకృష్ణారెడ్డి, మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరుల మండల నాయకులు మండల ప్రజలు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు జీవితంలో ముందుకు సాగాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అయన చిత్ర పటానికి పుష్పమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచ ప్రసిద్ధి పొందిన రామాయణ మహాకావ్యాన్ని సంకలనం చేసిన మహనీయులు వాల్మీకి మహర్షి, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే రామాయణ మధుర కావ్యాన్ని యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా సమాజానికి అందించారన్నారు. ఏ.ఓ శ్రీనివాసరావు, ఎస్.బి సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్.ఐ శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

కమీషనర్‌కు వైసీపీ నేతలు వినతి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాధ్‌రెడ్డిని వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు నేతృత్వంలో గురువారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పట్టణంలో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం మెరుగు పరచాలని కోరారు. అనంతరం వైసీపీ నాయకులందరూ నూతన మున్సిపల్ కమిషనర్‌ని సత్కరించారు. బాపట్ల పట్టణంలో చేపట్టే అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు వైసీపీ సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట బాపట్ల పట్టణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా, బాపట్ల జిల్లా వైఎస్ఆర్ పార్టీ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు ఆడే చందు, తన్నీరు అంకమ్మరావు, అఫ్జల్, పసుమర్తి సాల్మన్ ,గోపి, శ్రీను పాల్గొన్నారు.

మహర్షిగా ఎదిగిన వాల్మీకి సదా చిరస్మరణీయులు

మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఆటవిక జీవితాన్ని వదిలి మహర్షిగా ఎదిగిన వాల్మీకి సదా చిరస్మరణీయులని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ, సచివాలయాలు మరియు వాలంటీర్ల శాఖామాత్యులు డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. గురువారం ప్రకాశం భవనంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు అధ్యక్షతన జరిగిన వాల్మీకి జయంతి వేడుకలో కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీలతో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి వీరు పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడూతూ బీసీలకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవన ప్రమాణాలు పెరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ దిశగా ఆయా కార్పొరేషన్లకు నిధులు ఇచ్చి బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా బి.సి. సంక్షేమ అధికారి అంజల, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధరావు, దివ్యాంగుల సంక్షేమ అధికారి అర్చనలు పాల్గొన్నారు.

19న జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2024 పార్ట్ 2

విశాలాంధ్ర - ఒంగోలు: ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్సును ఘనంగా నిర్వహించింది. జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ పార్ట్-2 అక్టోబర్ 19 సాయంత్రం 6 గంటలకు ప్రసారం చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, వర్షిణి ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారన్నారు. ఆషిక, సౌందర్యల అద్భుతమైన ప్రదర్శనతో అన్ని సీరియల్ కుటుంబాల ప్రత్యేక ఎంట్రీతో ఘనంగా ప్రారంభమైన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. మేఘసందేశం సీరియల్ నటి భూమి నృత్య ప్రదర్శన ఈవెంట్కి మరింత సంప్రదాయ కళను తీసుకొచ్చిందన్నారు. యాంకర్ వర్షిణి జీ హీరోలందరితో కలిసి అద్భుతమైన మాస్ డాన్స్తో వీక్షకుల్లో ఉత్సాహంనింపిందన్నారు. టాలీవుడ్ లవ్లీ పెయిర్ తరుణ్, శ్రియశరణ్ ఎంట్రీ షో మరింత ఆహ్లాదంగా సాగిందన్నారు. శ్రియ సినిమాల్లోని ప్రసిద్ధిగాంచినసన్నివేశాలను డ్రామా జూనియర్స్ పిల్లలు రీక్రియేట్ చేసి నవ్వులు పూయించారన్నారు. తరుణ్తో జీ తెలుగు తారల అల్లరి, శ్రియ డాన్స్పెర్ఫామెన్స్ షోకి హైలెట్గా నిలిచాయన్నారు. ఉత్తేజకరమైన, వినోదభరితమైన, భావోద్వేగభరితమైన ప్రదర్శనలతో కార్యక్రమం ఆద్యంతం ఆసక్తికరంగా సాగిందన్నారు. మీప్రియమైన తారలు వారి అసాధారణ ప్రతిభ,సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రశంసిస్తూ ప్రతిష్ఠాత్మక జీకుటుంబం అవార్డులు 2024 అందుకున్నక్షణాల్లో జీ తెలుగు వేదికగా మీరూ భాగంకావాలన్నారు.

రాష్ట్రంలో దళితులకు మోసం

విశాలాంధ్ర-కనిగిరి : ఆంధ్ర పాలకులు దళిత ఓట్లతో గద్దెనెక్కి వారిని విస్మరిస్తున్నారని దళిత హక్కుల పోరాట సమితి ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి పందిటి మోహన్ అన్నారు. గురువారం కనిగిరిలోని పేరంగుడిపల్లి దళిత కాలనీలో దళిత హక్కుల పోరాట సమితి జెండాను బి కే యం యు నియోజకవర్గ కార్యదర్శి జి .పి రామారావు తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల స్థితిగతులను మెరుగుపరచవలసిన ప్రభుత్వాలు వారి ఓట్లు ద్వారా గద్దెనెక్కి వారి హక్కులను హరిస్తున్నారని ఇటువంటి చర్యలను దళితులు గ్రహించి ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి ఆర్థిక స్థితిగతుల్లో ఎటువంటి మార్పు రావటం లేదని ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప వారి జీవన విధానంలో మార్పు రావటం లేదని అన్నారు. నేడు ఆంధ్ర రాష్ట్రంలో కులాల మధ్య మతాల మధ్య ప్రభుత్వాలు చిచ్చుపెట్టి చలిమంట కాసుకుంటున్నాయని ఆయన అన్నారు ఇటువంటి చర్యలు గమనించి దళితులు ఐక్యత చాటి ఆ పార్టీలకు బుద్ధి చెప్పవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రాజకీయాల పబ్బం గడుపుకోవడం కోసం కుయుక్తులు పన్నుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలటూరి సల్మాన్, నేలపాటి సాల్మన్, నేలపాటి అబ్రహం, నేలటూరి దేవయ్య, నేలటూరి రమేష్, నెల టూరి అల్లూరమ్మ, గూడూరి కరుణమ్మ, మరియమ్మ నేలటూరి మరియమ్మ, నేలటూరి వాణి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మండలం పిన్నిబోయినవారిపాలెం గ్రామ పంచాయతీలో పల్లె పండుగ వారోత్సవాలలో కార్యక్రమంలో భాగంగా రూ.13 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణమునకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీలోని నందిరాజుతోటలో అంగన్వాడీ భవనం ప్రహరీ నిర్మాణం కొరకు రూ .16 లక్షలు ఏం.జి.ఎన్.ఆర్. ఈ.జి.ఎస్ నిధులతో బాపట్ల ఎంపిడిఓ బి.బాబురావు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం కల్లుగీత కార్మిక సంస్థ రాష్ట్ర మాజీ ఛైర్మన్ తాతా జయప్రకాశ్ నారాయణ, ముక్కామల సాంబశివరావు,మండల ఏపీఒ, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, గ్రామ పెద్దలు మరీదు వెంకటేశ్వరరావు, కందుల బాబు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంబను దర్శించుకున్న ముత్యాల నారాయణరెడ్డి బృందం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పర్యాటక కేంద్రమైన భైరవకోనను వైసీపీ సీనియర్ నాయకులు ముత్యాల నారాయణరెడ్డి బృందం త్రిముఖ దుర్గాంబను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు భూమిరెడ్డి వెంకటరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతంలో పద్యాలు రాసిన తొలి కవి వాల్మీకి

- జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్

విశాలాంధ్ర - బాపట్ల : సంస్కృతంలో 24,000 పద్యాలు రామాయణాన్ని ఆదికావ్యంగా రాసిన వాల్మీకి మహర్షి ఆదికవిగా నిలిచారని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. వాల్మీకి మహర్షి చిత్రపటానికి జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ పుష్పమాలలతో నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు,ఆర్డీవో పి.గ్లోరియా ఉన్నారు. రామాయణంతో దేశానికి గొప్ప కావ్యాన్ని రచించిన ఆ ఘనత మహా ఋషి వాల్మీకికే దక్కుతుందన్నారు. వేటగాడైన వాల్మీకి మహా ఋషిగా మారిన తదుపరి భక్తీభావంలో మునిగి పోయారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారిని శివలీల, సిపిఓ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

సుబ్బారావుకు రావూరి భరద్వాజ అవార్డు

విశాలాంధ్ర - చీరాల : జ్ఞానపీఠ పురస్కార గ్రహీత రావూరి భరద్వాజ సాహితీ పురస్కార ప్రధాన సభ ఆదివారం చీరాల సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో జరుగుతుందని రావూరి భరద్వాజ సాహితీ సమితి అధ్యక్షులు అంగలకుదురు నాగ వీరభద్రాచారి తెలిపారు.ప్రతి ఏడాది సాహితీ పురస్కారాలు అందజేస్తున్నామని ఈ ఏడాది వేటపాలెంకు చెందిన ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ప్రముఖ పద్యగేయ కవి,కర్ల సుబ్బారావుకు అందజేస్తున్నామన్నారు.గతంలో రావూరి పురస్కారాన్ని సత్రం మల్లేశ్వరరావు,బత్తుల బ్రాహ్మరెడ్డి, వడలి రాధాకృష్ణలు తీసుకున్నారని అన్నారు. పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమంలో కట్టా రాజ్ వినయ్ కుమార్, ఫణిధపు శివంజనేయప్రసాద్,మంగళగిరి పిచ్చాచర్యులు, బండారుపల్లి హేమంత్ కుమార్,రామానాయుడు, ఏకాంబరేశ్వరబాబు, గాదె హరిహరరావు, అత్తలూరు రామారావు పాల్గొంటారని తెలిపారు.

మణిమ్మ కుటుంబానికి కోన పరామర్శ

విశాలాంధ్ర - కర్లపాలెం : మాజీ ఎంపీటీసీ మార్పు మణిమ్మ భర్త విలియం ప్రధమ వర్ధంతి సందర్భంగా వైసీపీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే కోనా రఘుపతి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మార్పు మణిమ్మ యోగ క్షేమాలు అడగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు ఏడు కొండలు, కాగిత సుధీర్ బాబు, మండల యూత్ కన్వీనర్ సాగర్, బెనర్జీ, జోగి రాజా, గోవతోటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు ఎత్తివేయాలంటూ ధర్నా

విశాలాంధ్ర - చీరాల : చీరాల పట్టణ పరిధిలోని గొల్లపాలెంలో ప్రధాన రహదారి వెంబడి కూతవేటు దూరంలోనే పాఠశాల ఉందని, నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ మహిళలు యువకులు ఆందోళనకు దిగారు.గురువారం సాయంత్రం గొల్లపాలెంలోని పెట్రోల్ బంకు పక్కన గత ప్రభుత్వ హయంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉండేది అదే షాపు ఇటీవల జరిగిన టెండర్ల ప్రక్రియలో భాగంగా అదే మద్యం షాపు వచ్చింది అయితే ఈ షాపు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు ఆందోళనకు దిగారు.మద్యం షాపు ఎత్తివేయాలంటూ,స్పష్టమైన హామీ ఇవ్వాలంటూ పెద్ద ఎత్తున మహిళలు పిల్లలు యువకులు నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు.

అభివృద్ధి,సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వ సంకల్పమని,అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అన్నారు. గురువారం నియోజకవర్గంలో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఉదయం క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలు వింటూ వాటి పరిష్కారానికి అధికారులు ఆదేశించారు. అనంతరం, వలపర్ల,రాంకూరు,వింజనంపాడు,పమిడిపాడు,జొన్నతాళి గ్రామాల్లో పర్యటించారు.ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. అధికారులు ప్రజలు మెచ్చేలా పాలన సాగించాలని సూచించారు. ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధికి పునరంకితం కావాలన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ ధ్వంసం అయ్యాయన్నారు. రోడ్లు డ్రైన్లు మరమ్మతులకు నోచుకోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు అన్నారు. అభివృద్ధిని గాలికి వదిలేసి సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర పునర్మాణానికి చర్యలు చేపట్టిందన్నారు. నూతన రోడ్లు డ్రైన్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. దశలవారీగా అన్ని గ్రామాలలో రోడ్లు,డ్రెయిన్లు అభివృద్ధి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులకు పెన్షన్లు అందించేందుకు చర్యలు చేపడతామన్నారు. సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. ఎన్నికల సమయంలో హామీ మేరకు దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుంద న్నారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి పలు శుభకార్యాలకు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సమస్య వచ్చిన నేను న్నానంటూ భరోసా కల్పించి, ధైర్యం చెప్పారు.

పలు అకృత్యాలకు పాల్పడ్డ సజ్జల

ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు

విశాలాంధ్ర - వేమూరు : గత ప్రభుత్వంలో జరిగినటువంటి అన్యాయాలు అకృత్యాలకు ప్రధాన కారకుడైన సజ్జల రామకృష్ణారెడ్డికి నోటీసులు ఇవ్వటం కాదు పోలీసులు ఈడ్చుకెళ్లాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు వేమూరు వచ్చిన ఆయన సజ్జల రామకృష్ణారెడ్డి పోలీసు విచారణకు హాజరవుతారా అనే ప్రశ్నకు సమాధానం చెబుతూ టీడీపీ కార్యాలయం పై జరిగిన దాడికి, చంద్రబాబు నాయుడు ఇంటిపై జరిగిన దాడికి ప్రధాన నిందితుడు అయినటువంటి సజ్జలను నోటీసులు ఇచ్చి విచారణకు హాజరుకామనడం ఈ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజాస్వామ్య విధానాలకు నిదర్శనం అన్నారు.ఆయన గత ఐదేళ్లలో చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని పలు అకృత్యాలకు పాల్పడ్డారని విమర్శించారు.పోలీసుల నోటీసులకు వంకలు చెబుతూ మీడియా ముందు మాట్లాడుతున్నారంటే ఈ ప్రభుత్వం ఎంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా పనిచేస్తుందో అర్థమవుతుందని తెలిపారు. చట్టం తన పనులు తాను చేసుకుంటూ పోతుందని ఎవర్ని వ్యక్తిగతంగా టార్గెట్ చేసే విధానం ఈ ప్రభుత్వంలో ఉండదని వివరించారు. గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి గ్రామాల ప్రగతికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని జంపని, వేమూరు గ్రామాల్లో సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. జంపనిలో 30 లక్షల రూపాయలతో నిర్మితమవుతున్న సిసి రోడ్డు, వేమూరు లో 30 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో గ్రామపంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసి అభివృద్ధికి దూరంగా పెట్టిందన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం గ్రామాల పునర్నిమానానికి చర్యలు తీసుకుంటున్నట్టు గుర్తు చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు జొన్నలగడ్డ విజయబాబు, షేక్ హనీఫ్, వేల్పుల రవి, వట్టిప్రోలు యోబు, వేల్పుల జయప్రకాష్,సర్పంచ్ చుండూరు పెద్ద మరియమ్మ, గవిని లక్ష్మీ దుర్గ ,ఎంపీడీవో శివన్నారాయణ, తాసిల్దార్ సుశీల, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

సమాజ సేవలో మేము సైతం..

విశాలాంధ్ర - చీరాల : సమాజ సేవలో మా వంతు సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు అన్నదానం చేయడం ఆత్మ సంతృప్తినిచ్చిందని చీరాల నియోజక వర్గ అభివృద్ధి సాధన సమితి సభ్యులు పేర్కొన్నారు.గురువారం చీరాల ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నదాన చేశారు.ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంలో అత్యధికంగా చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగించే వారు ఎక్కువని ఆర్థికంగా అభివృద్ధి చెందిన వాళ్ళు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్తున్నారని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేది పెదలేనని అన్నారు.ప్రభుత్వ ఆసుపత్రికి దగ్గరలో ఎక్కడ భోజన సదుపాయం లేదని కొందరు దాతలు మాత్రమే ఉచిత అన్నదానం చేస్తున్నారని సమాజ సేవలో మేము సైతం అనుకోని భాగస్తులమయ్యమని అన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందిన వాళ్ళు పేదలకు తమకు కుదిరిన సహాయం చెయ్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి ఎన్డీఏ కూటమితోనే సాధ్యం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

విశాలాంధ్ర - కర్లపాలెం : పల్లె ప్రగతికి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమని కర్లపాలెం మండలం పేరలి గ్రామం,సమ్మెటవారిపాలెం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొని సీసీరోడ్లకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలు పల్లెలో అభివృద్ధితో ముందడుగు వేస్తున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిధులను ఉపయోగించి గ్రామాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వం నేరుగా నిధులను పక్కదారి పట్టించి జేబులు నింపుకుందని చంద్రబాబు నాయుడు పాలనలో మాత్రమే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి. విజయ లక్ష్మి, ఈ.ఓ.పి.ఆర్.డి.ఐనంపూడి శ్రీనివాసరావు, ఎం.పి.డి.ఓ అద్దూరి శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ రమేష్,మండల పార్టీ అధ్యక్షులు ఏపూరి భూపతిరావు, జడ్పీటీసీ వేణుగోపాల్ రెడ్డి,సమ్మెట నాగేంద్ర రెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి,గ్రామ పార్టీ అధ్యక్షులు దేవరం పాటి రాజ, జోగి రాజేష్ ,తిరపతయ్య, ఆవుల కోనయ్య , జోగి సురేష్, నాయకులు,కార్యకర్తలు,అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.